# రూపపటమెందుకు?

శ్రీమతి పాకలరత్నాబాయిగారు

"శారదా! నీపరీక్షసంగతి తెలిసినదా?" అని కమలం యింట్లోకివస్తూనే ఆత్రంగా అడిగింది.

"ఆ. తెలిసినది, కాని ముందునీవుకూర్చో. తరువాత సావకాశంగాచెబుతా"నన్నది శారద జడవేసుకుంటూ, గదిలోంచి.

"అయితే, ఏమైందోచెప్పు త్వరగా."

"అబ్బా! అంతతొందరెందుకే నీకు? ఈసారి నాపరీక్షగుడ్డు" అంది నవ్వుకుంటూ.

"ఆ. ఏమిటే? నీపరీక్షపోవడమా? అంతా అబద్ధం."

"నిజంగానే. కావలిస్తే మాఅమ్మనడుగు. నేను స్నానంచేసి యిప్పుడేవస్తా" అని శారద లోపలికి వెళ్లిపోయింది.

ఇంతట్లోకే సుందరమ్మగారు మెల్లిగాఅక్కడికివచ్చి కమలాన్నిచూచి "కమల!ఎప్పుడు రావటం?" అంది.

"నిన్ననేనండి. పండుగకు మానాన్నగారు తీసుకొచ్చేరు."

"అయితే, ఎన్నిదినాలుంటావు?"

"ఈసారి నాలుగైదునెల లుండమంటున్నారు."

"అమ్మో! మీ రదృష్టవంతులండీ. చిన్నతనంలో పెండ్లిచేసినా పుట్టినింటికిరావడం చాలారోజులువుండటంవుంది. మాలో పెండ్లిఅయితే అత్తవారిల్లేగతి. వారిదయగలిగి ఎప్పుడైనాపంపిస్తే పంపిస్తారు. లేకుంటే లేదు."

"అమ్మయ్యో! అలాఅయితే చిన్నప్పటినుండి కనిపెంచినవాళ్లనిచూడకుండావుండటం కష్టంకదూ?"

"కష్టమైనా తప్పదు. ఏంచేస్తారు పంపించకపోతే."

"అలాఅయితే మీ శారదకప్పుడే పెండ్లిచెయ్యకండి."

"అలాగేలే. నాకు పనుంది వెడతా. మీరు మాట్లాడుకోండి."

రమణారావుగారు వెలమకులస్థులు. బాగాడబ్బుగలవాళ్లే. ఆయనభార్య సుందరమ్మ. వీరికి శారద, రామమోహనరావు వీరిద్దరే పిల్లలు. ఇద్దరుపిల్లలూ చాలా తెలివిగలవాళ్లు. రామమోహనరావు బి. యల్. పరీక్షకు చదువుచున్నాడు. శారద థరుడుఫారంవరకూ స్కూలికివెళ్లి చదివింది. తరువాత స్కూలుమానిపించి ఘోషాలోపెట్టేరు. మరి వెలమలు కదూ! ఘోషాఎక్కువ. దానివల్ల ఇంట్లోవుండి పుస్తకాలు చదువుకోడం, పనిపాటలునేర్చుకోడం మొదలుపెట్టింది. ఒకసారి వార్తాపత్రికలో నరసాపురంపరీక్షవిషయమై ప్రచురించి

వుండగా చూచి సంతోషించి వెంటనే తల్లిదండ్రులను ఒప్పించి పరీక్షకుచదివించింది. అందులో జయముపొంది బంగారుపతకముబడసినది. కమలం శారద ప్రక్కయింటిపిల్ల. వారు బ్రాహ్మణులు. బాగా డబ్బుగలవాళ్లే. అయినా సంఘానికిలోబడి కమలానికి చిన్నతనంలోనే వివాహంచేశారు. కమలం, శారదా చిన్నప్పుడుకలసి చదువుకున్నారు. అందుకనివాళ్లిద్దరికిచాలా స్నేహం. కమలం పెద్దదయ్యాక అత్తగారింటికి వెళ్లింది. పుట్టినింటికివచ్చినప్పుడు రోజూ శారదయింటికివచ్చి మాట్లాడుతుంది. శారద పరీక్షసంగతి తెలుసుకోవాలని కమల తొందరగావచ్చిఅడిగింది. కాని శారద తమాషాగా గుడ్డుఅంది. సుందరమ్మగారు వెళ్లగానే శారద బొట్టుపెట్టుకుని మెళ్లో నెక్లయిసు వేసుకుంటూవచ్చి కమలందగ్గర కూచుంది.

"ఏమే! శారదా! చెప్పవూ?"

శారద నవ్వుతూ ఒకకార్డు కమలాని కిచ్చింది. అదిచదివి కమలం సంతోషముతో "అయితే ఫోటో పంపించావా?" అంది.

"లేదు."

"ఎందుకని పంపలేదు?"

"ఎందుకనా? ఘోషా. ఘోషాఅంటూ యింట్లో కూర్చుని ఎవ్వరికీకనబడకుండా వుండి చిత్రపటమూలంగా లోకానికి వెల్లడిచేసుకోవడం నాకిష్టంలేదుసుమా?"

"చాల్లే. నేను చెప్పేదివిను. నీవు ఘోషాపద్ధతిని ఇంటియందుండి కృషిచేసి అందు ఫలితమునొంది దానిచే కీర్తివడసి యాకీర్తిచంద్రికల వ్యాపింపజేయుటే గొప్పవిశేషము. నీవు ఘోషాపద్ధతి నవలంబించినచో నీకీర్తిగూడ ఘోషాగా మూలకూర్చుండునా? నీరూపమెవరికిని గోచరము కాకున్నను నీకీర్తితార ఎవరికిని తెలియకుండా ఉండునా? కీర్తినెవరు వ్యాపింపజేయ నవసరములేదు. అదియే వ్యాపించును. జనులు ప్రసిద్ధులైనవారిపేరు విన్నంతనే రూపమెట్లుండునో యని తలంతురు. ఛాయాపటముగూడ నున్నచో చూచి సంతోషింతురు. ఘోషాపద్ధతిని తొలగింప నాంధ్రరాష్ట్రీయమహిళాసభవారు ప్రయత్నించుచున్నట్లు నీకు తెలియదా? స్త్రీవిద్యావ్యాప్తికి, దేహారోగ్యమునకు, లోకజ్ఞానమలవడుటకు ప్రతిబంధకమైన ఘోషాపద్ధతిని దొలగించు టత్యవసరమని ఆసభవారు నొక్కివక్కాణించుచున్నారు. నీకిదియంతయు తెలుసునుగదా? కనుక తప్పక ఫోటోపంపించు."

"ఓహో! నీవు కవయిత్రివై పోవుచున్నావు. అబ్బా! ఎంత ఉపన్యాసమిచ్చేవు?"

"మరి నీకు తెలియనప్పుడు చెప్పవద్దూ? నీవింతచదువుకున్న దెందుకు?"

"ఎందుకా? జ్ఞానముకొరకు. అంతేగాని పత్రికల్లో పటమేసుకోవాలనిగాదు."

"సరేగానీ ఫోటోవేసుకుంటే తప్పేమిటోచెప్పు. ఇప్పుడెందరో విద్యావతులువేసుకుంటున్నారుకదా వాళ్లంతా తెలివితక్కువవాళ్లనా నీఅభిప్రాయం?"

"అది కాదే. వాళ్లు వేసుకుంటే ఫరవాలేదు. కాని ఘోషాలోవున్న-అందులోనావంటి వాళ్లు-వేసుకుంటే చాలా అసహ్యంగా వుంటుంది."

"నీవు చదువుకున్న దానవుకదా. ఇంకా ఎన్నాళ్లీ నిర్బంధవిధానంలోఉంటావు? చెప్పు. మళ్లీ దేశసేవఅంటూ మహాకబుర్లుచెబుతావు. పరదాలోవుండి నీవు చేసే దేశసేవఏమిటి?"

"ఓస్! పిచ్చిదానా! దానికా? కత్తిపట్టి పశువులనుకాచిన నారీమణియే కత్తిబట్టి కదనరంగమున కుతికినది. గృహలక్ష్మిసంక్రాంతిసంచిక చూడు. రమణమ్మఎవరు? ఆలోచించి నచో మాలో నెందఱు వీరనారులు గలరో నీకు తెల్లముకాగలదు. సమయమువచ్చినప్పుడు ప్రాణములనుతృణప్రాయములుగనెంచి అసువులబాసినవీరాంగనలెందరోమాలోగలరు.అప్పుడు పరదా వారినడ్డగింపజాలియుండలేదు. శౌర్యము వారి కుగ్గుపాలతో నేర్పినది. నేనుచేసేదేశ సేవ ఇపుడత్యల్పము. కాని కాలక్రమమున హెచ్చుగచేయగలను. కాని ముందు స్త్రీలకు విద్యయెక్కుడవసరము. కావున మనమిరువురమునుజేరి కొందఱుస్త్రీలనుచేర్చి నరసాపురపు పరీక్షకు చదివించామంటే చాలును. అట్లే స్త్రీలు ఉన్నతవిద్య బడయగలరు. ఉన్నతవిద్యా భ్యాసము లేనంతదనుక స్త్రీలు పురుషునిచేత విలాసవస్తువులు మాత్రముగనే యుందురు. భారతదేశము బాగుపడవలెనన్న మున్ముందు స్త్రీవిద్యాభ్యాసము చేయవలెను. అప్పుడే భారతమాత ధన్యతనొందగలదు. మన హైందవనారీమణు లున్నతదశకువచ్చినచో నదియే పదివేలు. వారికీర్తిచంద్రికలను వెదజల్లుటకు ప్రయత్నింతము. ఇదియే మన మొనర్పవలసిన పని. కాని రూపపటప్రకటనముగాదు.

## సుప్రియ

శాంతి బాలకృష్ణమూర్తిగారు

కఱవు శ్రావస్తిపురముఁ జీకాకుపఱుప
నాతురత శిష్యులం బుద్ధుఁడడిగెనిట్లు:
"కడుపుఁగాలినవారికి గంజిపోయఁ
గల దయాళులు మీలోనఁగలరటయ్య?"

* * *

"నాకుఁగల సర్వభాగ్యమంజకయొసఁగుదు"
ననియె రత్నాకరుండను ధనికుఁడొకఁడు—
"ఇందఱకు బువ్వఁబెట్ట నాయింటలేదు.
నాదుర క్తమ్ము సంతర్పణమొనర్తు"
ననియె సేనాని జయసేనుఁ డనెడువాఁడు—
"వానలాలేవు! పంటనిప్పచ్చరమ్ము!
పన్నుచెల్లక లిప్పలఁబడుదు" నంచుఁ
బీదపలుకాడె నాయూరి పెద్దకాపు
ధర్మపాలుఁడు నిట్టూర్చి దైన్యముునను.

* * *

కడఁగి సుప్రియయను బిచ్చకత్తెబిడ్డ
వినయమున నెల్లరకు మ్రొక్కియనియెనిట్లు:
"ఆఁకలిఁ దీర్తునేన అన్నాతురులకు."
"పొట్టకేలేని నీవెట్లు పెట్టఁగలవు?"
అనుడు వారికి సుప్రియ యనియెమరల:
"పేదనేయగాదు; నావంతు పిడికెడేని
దొరకకుండదుసుండీ మీాయిరవుల[illegible]."

—రవీంద్రుడు.